అన్నంత పని చేశారు!

- కౌన్సిల్ ఆమోదించిన రూ.34.85 కోట్ల అభివృద్ధి పనుల రద్దు
- 2025–26 నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.291.67 కోట్లకు ఆమోదం
- అభివృద్ధి పనులు చేపట్టడం లేదని పలువురు కార్పొరేటర్ల అసంతృప్తి
- సమస్యలపై సభ్యుల నిరసన గళం
- రూ.6.79 కోట్ల తీర్మానాలకు సభ గ్రీన్‌సిగ్నల్



సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సమాధానం చెబుతున్న కమిషనర్ రవీంద్రబాబు (ఇన్‌సెట్) నగరపాలక సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య అనుమతి లేని నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్న 20వ వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి

కర్నూలు (టౌన్): ప్రభుత్వం మారింది. 8 నెలలుగా అభివృద్ధి కుంటుపడింది. పైగా ప్రస్తుత ప్రభుత్వం అన్నంత పని చేసింది. నగరంలోని వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి మేయర్ అధ్యక్షతన పాలక వర్గం తీసుకున్న తీర్మానాలను రద్దు చేశారు. దీంతో నగరంలో రూ.34.85 కోట్లు విలువ చేసే 160 అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. అమ్మ పెట్టదు. అడుక్కో నివ్వదు అన్నట్లు ఇప్పటికే అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. పైగా గత కౌన్సిల్‌లో సభ్యుల ఆమోదంతో చేయతలపెట్టిన పనులను రద్దు చేయడంపై కౌన్సిల్‌లో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సంస్థ ప్రత్యేక బడ్జెట్ సమావేశం, సర్వసభ్య సమావేశం, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే 2025–26 ఆర్థిక సంవత్సరం నగరపాలక సంస్థ బడ్జెట్ రూ. 291.67 కోట్లకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు నగర మేయర్ బీవై రామయ్య సభలో ప్రకటించారు. అంతకుముందు మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కౌన్సిల్ సభ్యులు రెండు నిముషాలు మౌనం పాటించారు. అలాగే బడ్జెట్‌కు సంబంధించి ఆదాయం రూ.363.99 కోట్లు, ఖర్చు రూ.291.67 కోట్లు, రెవెన్యూ ఆదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనా వ్యయాన్ని బడ్జెట్‌లో చూపించారు. నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై సభ్యుల నిరసన గళం

సమావేశంలో స్థానిక సమస్యలపై పలువురు కార్పొరేటర్లు నిరసన గళం ఎత్తారు. తమ కాలనీలలో సమస్యలు పరిష్కరించడం లేదని వాపోయారు. అధికారులు సమాధానాలు చెబుతున్నా.. పనులు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించి ఎలాంటి ఫీజులు చెల్లించకుండా ప్రైవేటు బంకులు ఏర్పాటు చేసుకోవడమే గాకుండా రూ.5 వేలు బాడుగకు ఇస్తున్నా.. మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు కార్పొరేటర్లు ప్రశ్నించారు. అలాగే ఎస్‌బీఐ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ సర్కిల్ అధ్వానంగా తయారైందని, ఉద్దేశపూర్వకంగా పట్టించుకోవడం లేదా అని 50వ వార్డు కార్పొరేటర్ షేక్ మహమ్మద్ ప్రశ్నించారు. రెవెన్యూ తగ్గిందని, శానిటేషన్ అధ్వానంగా తయారైందని, గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణ సక్రమంగా లేదని సభలో 4వ వార్డు కార్పొరేటర్ ఆర్షియా ఫర్హీన్ అన్నారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా సర్వే నంబర్ 142లో 5 ఫ్లోర్ల నిర్మాణాలు చేపడుతున్నారని, అధికారులు పట్టించుకోంవడం లేదని 20 వార్డు కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి స్పష్టం చేశారు. అలాగే వీఎల్‌టీ, అప్రూవల్స్ అదాయం రావడం లేదని, 8 నెలలుగా అభివృద్ధి పనుల ఊసే లేదని 49వ వార్డు కార్పొరేటర్ కృష్ణకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. బ్యాడ్మింటన్ కోర్టు, టెన్నిస్ కోర్టుల నుంచి కార్పొరేషన్ ఎందుకు డబ్బులు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. తమ కాలనీలో పార్కులను కబ్జా చేస్తున్నారని, 60 అడుగుల రోడ్డు కాస్తా 30 అడుగులకు వచ్చిందని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. చెన్నమ్మ సర్కిల్ నుంచి లక్ష్మీపురం వెళ్లే రహదారిలో డివైడర్లు ఏర్పాటు చేయాలని, మున్సిపల్ నీళ్లు సరఫరా చేయాలని 28వ వార్డు కార్పొరేటర్ నారాయణ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. స్థలాలను వదలకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్న పట్టించుకోవడం లేదని చెప్పారు. గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఉన్న షాపుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి అదనపు కమిషనర్ కృష్ణతో వాగ్వాదానికి దిగారు. తన వార్డులో డిస్పోజల్ డ్రైన్ నిర్మించకుండా జాప్యం చేయడం వల్లే సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రజా ప్రతినిధి పట్ల సిటీ ప్లానర్ చులకన భావంతో మాట్లాడటం తగదన్నారు. సర్వే నంబర్ 384లో ఖాళీ స్థలం వదలకుండా నిర్మాణాలు చేపట్టారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కార్పొరేషన్‌కు అదనంగా మరో రెండు డోజర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆమోదించిన తీర్మానాలు

- రూ.35 లక్షలతో 6వ వార్డు గరీబ్ నగర్‌లో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం
- 35వ వార్డు ఉమామహేశ్వరరావు నగర్‌లో రూ.42 లక్షలతో రహదారి నిర్మాణం
- 37వ వార్డు శాంతి నగర్‌లో రూ.50 లక్షలతో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు
- 34వ వార్డు నిర్మల్ నగర్‌లో రూ. 27లక్షలతో కాంపౌండ్ వాల్
- 3వ వార్డు సాగుమండీ, బండిమెట్ట ప్రాంతాల్లో రూ.40 లక్షలతో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు
- 16వ వార్డు బుధవారపేటలో రూ.18.50 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణ పనులు
- 19వ వార్డు నాజర్‌కాలనీ, మల్లికార్జున నగర్‌లో రూ.33 లక్షలతో డిస్పోజల్ డ్రైన్
- 20వ వార్డు బద్రీనాథ్ నగర్, ధనలక్ష్మీ నగర్‌లో రూ.53.25 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణాలు
- 21వ వార్డు గురుకుల పాఠశాల నుంచి ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.24.50 లక్షల కేటాయింపు
- 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో రూ.40.20 లక్షలతో మురుగు కాల్వల నిర్మాణ పనులు
- మాస్టర్ ప్లాన్ అభివృద్ధి, ఆదాయం పెంపు వంటి సాంకేతిక పనులు చేపట్టేందుకు శ్రీవాస్త కన్సల్టెన్సీ ఏజెన్సీకి రూ.94.40 లక్షల మంజూరుకు అనుమతి

క్లుప్తంగా

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు ఏరియాలోని సచివాలయాల ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల తమ పార్టీ నిర్వహించిన పోరాటాలతో దిగివచ్చిన ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇవ్వడానికి అంగీకరించినట్లు చెప్పారు. అయితే వెంటనే స్థలం ఇచ్చి రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసరావు, చిన్న సుంకన్న, లావణ్య పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి

కర్నూలు(సెంట్రల్): వక్ఫ్ చట్ట సవరణను రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ సుభాన్, సభ్యులు మహ్మద్ షరీఫ్, పి.ఇక్బాల్‌హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. వక్ఫ్ సరవణ చట్టంపై పార్లమెంట్ నియమించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లో కూడా బీజేపీ ఇతర పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఆమోదించుకోవడం అన్యాయమన్నారు. వక్ఫ్ ఆస్తుల వివరాలు బీజేపీకి ఎందుకని ప్రశ్నించారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో మహిళలు రాణించాలి

కర్నూలు (టౌన్): కరాటే, ఉషూ లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడల్లో మహిళలు రాణించాలని కె.వి.ఆర్. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్ సూచించారు. గురువారం స్థానిక కె.వి.ఆర్. మహిళా డిగ్రీ కళాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి రోజు క్రమం తప్పకుండా అభ్యాసన చేస్తే క్రీడల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులకు ఉషూ బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి బెల్టులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద చెత్తకుండీలు తప్పనిసరి



కొత్తబస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలోని టీ, టిను బండరాలు వంటి వాణిజ్య దుకాణాల ఎదుట తప్పనిసరిగా చెత్త కుండీలు ఉండాలని లేకుంటే సంబంధిత దుకాణాదారుడిపై చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం నగరంలోని బంగారు పేట, కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా, చెన్నమ్మ సర్కిల్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అలాగే కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. పలు ప్రాంతాల్లో దుకాణాల వద్ద చెత్తచెదారం ఉండటంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంపై మరింత శ్రద్ధ వహించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

కర్నూలు (టౌన్): విశాఖపట్నంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించిన రీజినల్ స్టేట్ మీట్‌లో కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వి.అజయ్‌కుమార్ సింగిల్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో విన్నర్స్‌గా నిలిచారు. ఫైనల్ పోటీల్లో గుంటూరుకు చెందిన జాయ్‌కుమార్‌తో పోటీపడి బెస్ట్ ఆఫ్ త్రీలో రెండు రౌండ్లలో ఆధిపత్యం ప్రదర్శించి విజయం సాధించారు. విజేతగా నిలిచిన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహులు అభినందించారు.

ఏపీజేఏసీ అమరావతి జిల్లా కమిటీ ఎన్నిక



నూతన సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): ఏపీజేఏసీ నూతన జిల్లా చైర్మన్/అధ్యక్షుడిగా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.వై.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజు, వైస్ చైర్మన్‌గా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఈ.మద్దిలేటి ఎంపికయ్యారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన ఏపీజేఏసీ అమరావతి సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా నాగ రమణయ్య, నాగరాజు, రామానాయుడు, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సూరిబాబు, మల్లేశ్వరమ్మ ఎన్నికయ్యారు.

కుష్టు వ్యాప్తిని అరికట్టాలి



నర్సింగ్ విద్యార్థినిలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కుష్టు వ్యాప్తి చెందకుండా అరికట్టాల్సిన బాధ్యత వైద్య సిబ్బందితో పాటు ప్రజలపై ఉందని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. కుష్టు వ్యాధిపై అవగాహన పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లోని విశ్వభారతి నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు స్పర్శ్ పేరుతో కుష్టు వ్యాధిపై అవగాహన పక్షోత్సవాలు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, డ్వాక్రా, పొదుపు సంఘాలు, గ్రామ పంచాయతీలు, సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పర్శలేని మచ్చలు, నరాల వాపు, తిమ్మిర్లు, చేతి నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్ల నుంచి చెప్పులు జారిపోవడం, కణితులు వంటి లక్షణాలు కుష్టులో ఉంటాయన్నారు. న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష, చిన్నచూపు చూడకూడదన్నారు. ఈ వ్యాధికి ఎండిటి మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపీ నంబర్ 37లో వైద్య సేవలు అందిస్తారన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థినిలచే ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ లీనారెడ్డి, ఫిజియోథెరపిస్ట్ రెడ్డిబాబు, డీపీఎంఓ విజయప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, మృతురాలి బంధువులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యం కోసం వస్తే ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ గురువారం కర్నూలులోని ఓమ్ని హాస్పిటల్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న మాట్లాడుతూ.. దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన కురువ ఆదిలక్ష్మి 40 రోజుల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రిలో చేరిందన్నారు. ఆరోగ్యశ్రీ అప్రూవల్ అయినా వారి నుంచి అదనంగా రూ.70 వేలు వసూలు చేశారని ఆరోపించారు. నిర్లక్ష్యంగా ఆపరేషన్ చేయడంతో ఆదిలక్ష్మి అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని బుధవారం చనిపోయిందని తెలిపారు. గతంలోనూ ఈ హాస్పిటల్‌లో హర్షవర్ధన్‌నాయుడు, రామచంద్రుడు అనే వారు వైద్యుల నిర్లక్ష్యానికి గురై మరణించారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న ఈ హాస్పిటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు నాగరాజు, నాయకులు కృష్ణ, చంటి, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని పరిరక్షించుకుందాం



పోస్టర్లను విడుదల చేస్తున్న డీటీడబ్ల్యూఓ తులసీదేవి

కర్నూలు(అర్బన్): దేశంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కోరారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో రాజమండ్రి నన్నయ్య విశ్వ విద్యాలయంలో జరగనున్న జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి కే తులసీదేవి విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ.. గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు ఈ మహోత్సవాలను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది గిరిజన మేధావులు, ప్రతినిధులు, కళాకారులు హాజరవుతారన్నారు. ఏఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామరాజు,వెంకటేష్, బంజారా ధర్మసేన జిల్లా అధ్యక్షుడు రాజారాం నాయక్, దళిత నాయకులు దేవవరం పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను మూసివేందుకు కుట్ర



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిల భారత విద్యా హక్కు వేదిక ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల మూసివేతకు కుట్రలు చేస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 117ను పూర్తిగా రద్దు చేస్తామని హామీ ఇచ్చి గెలిచిన తరువాత మరోరూపంలో అమలు చేయడానికి చర్యలు చేపట్టడం దారుణమని వాపోయారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట అఖిల భారత విద్యాహక్కు వేదిక ఆధ్వర్యంలో 3, 4, 5తరగతుల విలీనాన్ని ఆపాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీఓ 117ను మరో రూపంలో అమలు చేస్తుండడంతో ఒక అవాస ప్రాంతంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఆదర్శ పాఠశాలల పేరిట వేరే ఊరికి తరలించడానికి రంగం సిద్ధం చేస్తోందన్నారు. దీన్ని ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. ప్రభుత్వ ఆలోచనను విరమించుకొని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగాలని, ఉన్నత పాఠశాలలో కూడా సమాంతర మధ్యమాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానంతో ఉపాధ్యాయులు లేక ప్రాథమిక పాఠశాలలు కూనరిల్లుతాయని, మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా రాష్ట్ర ప్రభుత్వం టీచర్ పోస్టులను రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతులు తీసివేయడం వల్ల పదోన్నతులు పొందిన పాఠశాల సహాయకుల పోస్టులకు గండం వాటిల్లుతుందన్నారు. నాయకులు గట్టు తిమ్మప్ప, ఇస్మాయిల్ భాస్కర్, రోషన్న, రాజసాగర్ పాల్గొన్నారు.

సప్లయర్స్ దుకాణంలో అగ్నిప్రమాదం

కర్నూలు: కల్లూరు పీహెచ్‌సీ పక్కన సప్లయర్స్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుని భారీ మొత్తంలో షామియానాలు, కుర్చీలు కాలి బూడిదయ్యాయి. సప్లయర్స్ దుకాణం వెనుకనే పెద్ద చెత్త దిబ్బ ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో గురువారం ఉదయం ఆ దిబ్బలో మంటలు చెలరేగి సప్లయర్ దుకాణంలోకి వ్యాపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అగ్నిమాపక శాఖ సిబ్బంది హుటాహుటిన వాహనంతో అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు యజమాని రవికుమార్ ఫిర్యాదు చేశారు.

ధ్వజారోహణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న గరుడ పక్షి

కర్నూలు(సెంట్రల్): సంకల్‌బాగ్‌లో హరిహర క్షేత్రంలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున గరుడ పక్షి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం చూపరులను ఆకట్టుకుంది. పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, బ్రాహ్మణ సంఘం నాయకులు దుర్గాప్రసాదు, శ్రీధర్, సుబ్రమణ్యం, ఆర్యవైశ్య నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

నిస్వార్థ దేశభక్తుడు టీకేఆర్ శర్మ

కర్నూలు (సిటీ): భారతీయులందరూ ఒకే కుటుంబం అని వారిని ఎవరూ విడదీయలేరని మాజీ మంత్రి టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు టీకేఆర్ శర్మ శతజయంతి ఉత్సవం సబ్ క్లస్టర్ విశ్వవిద్యాలయం, సాహితీ సదస్సు కర్నూలు సంయుక్త ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రకాశం సభ భవనంలో గురువారం నిర్వహించారు. కె.చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులు టీజీ వెంకటేష్, క్లస్టర్ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ హాజరయ్యారు. ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ ప్రకాశం పంతులు, పీవీ నరసింహారావు, టీకేఆర్ శర్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఎంతో మేధా సంపత్తి ఉన్నవారికి కూడా కులం అంటగట్టడం భావ్యం కాదన్నారు. విద్యార్థులు కులమతాలకు అతీతంగా అభివృద్ధి చెంది సమాజ హితానికి పాటుపడాలని సూచించారు. క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ, సభాధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూరా మాట్లాడుతూ.. టీకేఆర్ శర్మ సేవలను కొనియాడారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి, కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, సి.సంజీవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ విజయ్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, వీవీఎస్ మూర్తి, జయప్రకాష్, డీఎస్పీ మహబూబ్ బాషా, కొట్టే చెన్నయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పి.శ్రీకాంత్ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమం సమన్వయం డాక్టర్ పార్వతీ దేవి చేయగా, టీకేఆర్ కృష్ణమూర్తి, మురళీమోహన్, ఇతర సభ్యులు అతిథులను శాలువా, మెమెంటోలతో సన్మానించారు. జీఎస్ఆర్‌కే శర్మ సుబ్బలక్ష్మి, హెచ్‌కే మనోహర్, కేజీ గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని ఎలుకూరు ఎస్టేట్‌లో జరిగిన లిఫ్ట్ ప్రమాదంలో ఒకరు మరణించారు. 19వ వార్డులో ఉన్న ఎలుకూరు ఎస్టేట్‌లో కలెక్టర్ రిటైర్డ్ డ్రైవర్ శ్రీరాములుకు చెందిన మూడు అంతస్తుల భవనానికి ఏర్పాటు చేసిన లిఫ్ట్ రిపేరీ రావడంతో నిలిచి పోయింది. రిపేర్ చేసేందుకు హైదరాబాదులో స్థిరపడిన కేరళ నివాసి సీనియర్ లిఫ్ట్ టెక్నీషియన్ వినోద్ అలియాస్ జాన్సన్ అనే వ్యక్తి డేవిడ్, సాయి అనే హెల్పర్లతో కలసి వచ్చాడు. లిఫ్ట్ రిపేర్ చేస్తుండగా లిఫ్ట్ జారి పడటంతో కింద ఉన్న సీనియర్ టెక్నీషియన్ వినోద్ అక్కడికక్కడే మరణించాడు. హెల్పర్లు ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయం కేరళ సీపీఎం నాయకుల దృష్టికి పోవడంతో వారు వెంటనే ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్‌కు ఫోన్‌లో సమాచారం చేరవేశారు. ఆయన సూచన మేరకు ఆ పార్టీ నాయకులు రాముడు, నరసింహులు, రాధాకృష్ణ, మాలిక్ తదితరులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన వినోద్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా వ్యవస్థలోని లోపాలపై పోరాటం చేయండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసానిని సత్కరిస్తున్న విద్యార్థి విభాగం నాయకులు

కల్లూరు: విద్యా వ్యవస్థలోని లోపాలపై విద్యార్థి సంఘాలతో కలిసి పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైన రాకేష్, ఐటీ విభాగం అధ్యక్షుడు శివకృష్ణారెడ్డితో పాటు యువకులు, విద్యార్థులు గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. విద్యా సమస్యలపై విద్యార్థుల తరుపున ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.హనుమంతరెడ్డి, విద్యార్థి నాయకులు సాయి కుమార్, గిరీష్, రంగన్న, బాలరాజు, భాస్కర్ నాయుడు, సురేంద్ర, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరెటుపోతే నాకేంటి !



పాత ఈద్గా వద్ద రోడ్డు మధ్యలో నిలిపిన లారీ

కర్నూలు న్యూసిటీ: నగరంలోని పాత ఈద్గా ముందు కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. ఎల్లప్పుడూ కిక్కిరిసి ఉండే ఈ ప్రాంతంలో ఒక్క వాహనం కొద్దిగా ఆలస్యంగా కదిలినా తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరిగే ప్రమాదాలు అధికం. అలాంటి ఈ ప్రాంతంలో రైల్వేస్టేషన్ నుంచి ఎరువులను గోడౌన్‌కు తరలిస్తున్న ఒక లారీ డ్రైవర్ రోడ్డు మధ్యలో లారీని ఆపేశాడు. ట్రాఫిక్‌లో ఇతర వాహనదారుల ఇబ్బందులను పట్టించుకోకుండా లారీలో లోడ్ చేసిన ఎరువుల సంచులను జారిపోకుండా సర్దుకుంటున్నాడు. దీంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో లారీని ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన ఆపుకుని బస్తాలను సర్దుకుని వెళ్లిపోయారు. తర్వాత రాకపోకలు సజావుగా సాగాయి.

లారీలకు ప్రత్యామ్నాయ దారిని చూపండి

గూడ్స్ రైళ్ల ద్వారా రైల్వేస్టేషన్‌కు వచ్చే ఎరువులు, బియ్యం బస్తాలు ఇతర సరుకులను లారీలలో గోడౌన్‌లకు తరలిస్తుంటారు. అసలే కిక్కిరిసి ఉండే ఈ రహదారిపై సరుకుల లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో లారీలను ఈ మార్గంలో గాకుండా వెంకటరమణ కాలనీ వైపుగా నడిపేలా చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ సమస్యకు కొంత ఉపశమనం కలుగుతుందని నగర వాసులు పేర్కొంటున్నారు.

మహాత్ముడికి ఘన నివాళి



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు



హెచ్‌ఆర్‌సీలో గాంధీ చిత్ర పటానికి నివాళుర్పిస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): గాంధీ చూపిన అహింసా, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ పౌర సంబంధాల అధికారి పి.హనుమంతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో మహాత్మగాంధీ 77వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కమిషన్ విభాగాధికారులు జి.సునీత, బొగ్గరం తారకనరసింహ కుమార్, సిబ్బంది సురేష్‌బాబు, నల్లమిల్లి శ్రీనివాసులరెడ్డి, ధనరాజ్, రఫీ పాల్గొన్నారు.

నారాయణ జూనియర్ కాలేజీలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, ప్రిన్సిపాల్ సుధాకర్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ముజఫర్‌నగర్‌లో ఐద్వా నాయకురాలు దానమ్మ, డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి హుస్సేన్‌బాషా తదితరులు నివాళులర్పించారు.

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలోని పార్కులోని గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, నాయకులు దామోదరం రాధాకృష్ణ, సాంబశివుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మహాత్మా గాంధీ విగ్రహానికి డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీపీఎంవో డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ శైలేష్‌కుమార్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.